
# కలిసొచ్చిన కొడుకుతో నడిచొచ్చిన పాట

**కేసీఆర్‌కు పలుకుబడులు,** సామెతలు కొట్టిన పిండి. పాటలో పవర్ తెలిసిన నాయకుడు కేసీఆర్. తెలంగాణ యాస, భాషల్లోని గాఢత కేసీఆర్‌కు బాగా తెలుసు. వలస పాలనలో తెలంగాణ బిడ్డలు అనుభవిస్తున్న దుఃఖం తెలుసు. బంధనాల నుంచి బయటపడే మార్గమూ తెలుసు. అందుకే ఆయన వెంట మొత్తం తెలంగాణ కదిలింది. ఉద్యమానికి ఊపిరి పోయడానికి ఎందరో కవుల్ని, గాయకుల్ని కేసీఆర్ చేరదీసిండు. ఆదరించిండు. ఏ సభ జరిగినా ప్రసంగాల కంటే పాటలకే ఎక్కువ సమయమిచ్చిండు. కవులు, కళాకారులతో మమేకమైన కేసీఆర్ చాలా పాటల్లో తన దైన శైలిలో పదాలను అందించిన సందర్భం లేకపోలేదు. తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం టీఆర్ఎస్ పాటల క్యాసెట్లు రూపొందించింది. వాటిల్ల గోదావరి నదీ జలాల పాటలు, ఫ్లోరైడ్ పాటలు, తెలంగాణ కరవు, వలసపాలకుల కుట్రలు ఉన్నయి. ఈ పాటల క్యాసెట్లలో సుద్దాల అశోక్‌తేజ రాసిన ''ఇది తెలంగాణ కోటి రతనాల వీణ'' పాట ప్రజాగర్జన సభల్లో మార్మోగింది. వరంగల్ శ్రీనివాస్, మిత్ర, కోదారి శ్రీనివాస్, ఏపూరి సోమన్న, నేర్నాల కిషోర్, పాటమ్మ భిక్షపతి, అంబటి వెంకన్న, అభినయ శ్రీనివాస్, నిసార్, మిట్టపల్లి సురేందర్, పైలం సంతోష్, పాలిశెట్టి లింగన్న, బోడ చంద్రప్రకాశ్ మొదలైన కవిగాయకులెందరో వందలాది పాటలు రాసి, వేలాది వేదికలపై పాడి తెలంగాణ ఉద్యమాన్ని ఊరేగించిండ్రు. వీళ్లు లేకుండ, వీళ్ల ఆటాపాటా లేకుండ తెలంగాణ ఉద్యమం లేదు. వడ్లకొండ అనిల్, రమాదేవి, తేలు విజయ ఇంకా ఎందరో కవులు, కళాకారులు ఉప్పెనలా ఈ ఉద్యమంలోకి దుంకిండ్రు.



ఒక రకంగా తాను అనుభవించిన జీవితాన్ని కైగట్టిండు. తెలంగాణ ఉద్యమంలో ''వలసెల్లిపోయింది ఊరు/ నేడు వల్లకాడయ్యింది సూడు'' అని అంటూ మన గోసను అక్షరీకరించిండు. నాటి సమైక్యపాలనలో ఆగమైన తెలంగాణ జన జీవితాన్ని చింతల యాదగిరి తన పదాలతో కండ్లకు కట్టిండు. గుండమల్ల శ్రీనివాస్ రాసిన ''గూడు నిడిసినం మా గుడిసెనిడిసినం/ పల్లెనిడిసినం కన్నతల్లినిడిసినం'' అంటూ శోకాన్ని ఆలపించిండు. చెమ్మగిల్లిన కండ్లతో ''అమ్మా ఓ తెలంగాణమా కన్నీరేల నమ్మా'' అన్నడు. సుందిళ్ల రాజన్నది ఒక ప్రత్యేకమైన శైలి. హిందీ, ఉర్దూ పదాలు కలెగలిసిన పాటలు చానా ఉన్నయి. ఆయన రాసిన ''తెలంగాణ అచ్చేదాక తెగించి కొట్లాడుడే/ జమాంచి జంగుకురుకుడే/ లగాంచి లడాయ్‌జేసుడే'' అనే పాట పద్మావతి గొంతులో ప్రాణం పోసుకుంది. ఆ పాట ఉద్యమానికి ఓ ఊపు తెచ్చింది. రాజకీయ, సామాజిక చైతన్య గేయాలు రాసిన పాలిశెట్టి లింగన్న ''కాసెలుబోసి కత్తులు దూసిన తెలంగాణము'' అంటూ తెలంగాణ ఉద్యమ గీతం అందుకున్నడు. ''ఎన్నాళ్లింక ఆరని కన్నీళ్లు ఓ చెల్లెమ్మా'' అనే పాటతో మహిళాశక్తిని తట్టిలేపిండు.









### గజ్జెలు గజ్జెలు రెండు గజ్జెలో రాజన్నా

''లొల్లీ లొల్లీ లొల్లీ బుట్టే/ తెలంగాణ లొల్లీ బుట్టే/ ఊరువాడ లొల్లీబుట్టే/ పట్నములా లొల్లీ బుట్టే'' అంటూ ముక్క కరుణాకర్ రాసిన పాట ఉద్యమం తొలి నాళ్లలో ఒక ఊపు తెచ్చింది. నిర్బంధ కాలంలో నడిసొచ్చిన కేసీఆర్‌తో తెలంగాణ ఉద్యమానికే కాదు ఇలాంటి పాటలకూ కలిసొచ్చింది. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావంతో మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైంది. కేసీఆర్ సారథ్యంలోని ఉద్యమపార్టీ గాయకుల వేదికైంది. పాటను స్వేచ్ఛగా, నిర్భయంగా పాడుకునే అవకాశమొచ్చింది.